

కార్పొరేషన్లు కళా విహీనం

- వైసీపీ పాలనలో నిధులు లేక నిర్వీర్యం
- అలంకారప్రాయంగా మారిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు
- నవరత్నాలకే నిధులన్నీ తరలింపు
- ఆర్థికంగా చితికిపోయిన నిరుద్యోగ యువత, ఔత్సాహికులు
- టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో మంచిరోజులు వస్తాయన్న ఆశ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 10: వైసీపీ పాలనలో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు నిధులు లేక బక్కచిక్కిపోయాయి. ఐదేళ్ల పాలనలో ఆ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి నిధులు విదల్చకుండా, సబ్సిడీ లోన్లు, స్వయం ఉపాధి పథకాలను ఎత్తేసి ఆయా కార్పొరేషన్లకు సమాధి కట్టిందనే విమర్శలు ఉన్నాయి. నవరత్నాలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనలకు మాత్రమే ఈ కార్పొరేషన్లు ఉపయోగపడ్డాయి. కార్పొరేషన్ల లో ఉన్న నిధులన్నీ నవరత్నాల పథకాలకు మళ్లించి ఖజానాను ఖాళీ చేశారు. ఆదరణ పథకాన్ని పూర్తిగా ఎత్తేసి కులవృత్తులపై ఆధారపడి జీవించే వారి ఉపాధి మార్గాలకు గండి కొట్టారు. ఇలా వైసీపీ ఐదేళ్ల పాలన కార్పొరేషన్ల ద్వారా ఎవరికీ ఎలాంటి లబ్ధి లేకుండానే ముగిసి పోయింది. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు కాబోతున్న తెలుగుదేశం ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలతో ఉన్నారు. కార్పొరేషన్లకు పూర్వవైభవం తీసుకొచ్చి మునుపటిలాగానే సబ్సిడీ రుణాలు, స్వయం ఉపాధి పథకాలను తీసుకొచ్చి తమకు ఉపాధి మార్గాలు చూపాలని ఆయా వర్గాలు కోరుతున్నాయి. ఇంతకు ముందు ఏ పథకాలైతే అమలు చేశారో వాటన్నింటిని తిరిగి అమలు చేసి నిరుద్యోగ యువత, చిన్నతరహా వ్యాపారాలు చేసుకునే ప్రజలకు అండగా నిలవాలని పలువురు కుల, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

వైసీపీ పాలనలో కార్పొరేషన్లకు సమాధి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం గత టీడీపీ ప్రభుత్వం సబ్సిడీపై రూ.వేల కోట్ల రుణాలు మంజూరు చేసింది. 50 శాతం సబ్సిడీతో రూ. లక్ష, రూ. 2 లక్షలకుపైగానే రుణాలను విరివిగా మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 వేల మంది ఎస్సీ నిరుద్యోగ యువత, చిన్నతరహా వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.రెండు లక్షలు చొప్పున రుణాలు మంజూరు చేసి, వారి స్వయం ఉపాధికి బాటలు వేసింది. ఎస్టీల్లో ఏడు వేల మందికి రుణాలను మంజూరు చేయగా.. మైనార్టీల్లో ఐదు వేల మంది, బీసీల్లో 40 వేల మందికి రుణాల ద్వారా లబ్ధి చేకూర్చింది. వీటితో పాటు ఎంతో మందికి సబ్సిడీపై వాహనాలు అందించి ఆయా వర్గాల యువత ఉపాధికి దోహదపడింది. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఎస్సీ, ఎస్టీల ఆర్థిక పురోభివృద్ధికి ఎంతో ప్రోత్సాహమందించింది. ఆ వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా వెయ్యి మందికిపైగా లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేశారు. గొర్రెల పెంపకం, పాడిపరిశ్రమ, పెద్ద, చిన్న తరహా గార్మెంట్స్, జనరల్ స్టోర్స్ తదితర చిన్న తరహా వ్యాపార సముదాయాల కోసం ఒక్కొక్కరికి రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకూ రుణాలు మంజూరు చేసి ఆ కుటుంబాల జీవన ప్రమాణాలు పెంచింది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో టీడీపీ ప్రభుత్వ పథకాలకు గ్రహణం పట్టింది. కేవలం నవరత్నాలు ఇస్తున్నామనే ముసుగులో... కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాలను ఎత్తేసింది. కనీసం మిగులు పథకాల కోసమైనా నిధులు ఇస్తుందా అనుకుంటే, ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఉన్న నిధులను కూడా ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసింది. ఫలితంగా ఔత్సాహికులు ఐదేళ్లల్లో పడరాని పాట్లు పడ్డారు. కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందజేసింది. కుల



బీసీ కార్పొరేషన్ కార్యాలయం



ఎస్సీఎస్టీ కార్పొరేషన్ల సముదాయం.. పెన్నార్ భవన్

అడ్రస్ లేని 'ఆదరణ'



వృత్తుల ఆధారంగా పనులు చేసుకుంటున్న వారికి ఇస్త్రీపెట్టెలు, వాషింగ్‌మెషీన్లు, తోపుడు బండ్ల కోసం రుణాలు, హెయిర్ సెలూన్ సామగ్రి, కుట్టు మెషీన్‌లు, పాలక్యాన్‌లు, సైకిళ్లు, చేనేతలకు మగ్గాలు, ముడి సరుకుకు అవసరమైన రుణాలు, కార్పెంటర్లకు డ్రిల్లింగ్ మెషీన్‌లు అందజేసి అండగా నిలిచింది. వీటితో పాటు బలహీన వర్గాల్లో ఎవరైతే అత్యంత వెనుకబడ్డారో అలాంటి వారికి రూ.30 వేల ఆర్థిక చేయూతనందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ పథకాలను పత్తాలేకుండా చేసి కులవృత్తులపై ఆధారపడి జీవించే వారి కడుపు కొట్టిందని ఆయా వర్గాలు మండిపడుతున్నాయి. మరోవైపు సొసైటీలకు అందించే రుణాలకు మంగళం పాడింది. 14 లేదా 15 మందితో కూడిన ఒక సొసైటీకి దాదాపు రూ. 10 లక్షలకుపైగా రుణాలను గత టీడీపీ మంజూరు చేసింది. వాటిని సైతం పక్కనబెట్టేయడంతో ఆయా సొసైటీల నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయా సొసైటీలు సైతం టీడీపీ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

టీడీపీతోనే కార్పొరేషన్లకు పూర్వ వైభవం..



వైసీపీ ఐదేళ్లపాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లను సర్వ నాశనం చేసింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఏవైతే పథకాలను అమలు చేసి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిందో... వాటన్నింటిని ఐదేళ్లల్లో వైసీపీ నిర్వీర్యం చేసింది. కేవలం టీడీపీకి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే కార్పొరేషన్లలో పథకాలన్నీ రద్దు చేసి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలకు ఉపాధి లేకుండా చేసింది. బీసీ కార్పొరేషన్ ద్వారా అమలయ్యే ఆదరణ పథకాన్ని ఎత్తేసి కులవృత్తులపై ఆధారపడి జీవించే వారికి తీరని అన్యాయం చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మళ్లీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకొచ్చి గతంలో ఏ పథకాలైతే అమలయ్యాయో వాటన్నింటిని అమలు చేస్తుందనే నమ్మకం ఉంది. ఎన్నికల సమయంలో సైతం కూటమి నేతలు కార్పొరేషన్లను పునరుద్ధరిస్తామన్న మాట నిలబెట్టుకోవాలి.

- సురేష్‌యాదవ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య

నిరుద్యోగ యువతకు విరివిగా రుణాలివ్వాలి



వైసీపీ ఐదేళ్ల అరాచక, నియంత పాలనకు ప్రజలందరూ సమాధి కట్టేశారు. ఇక ఆ ప్రభుత్వం గురించి మాట్లాడటం వేస్ట్. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చింది. నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను విరివిగా మంజూరు చేయాలి. వీలైతే రుణాన్ని మరింత పెంచి ఆ వర్గాలకు బాసటగా నిలవాలి. అదేవిధంగా విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కార్పొరేషన్ల ద్వారా కొత్త పథకాలు తీసుకువస్తే బాగుంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగ యువత మొత్తం కార్పొరేషన్లపై ఆశలు పెట్టుకుంది. వారి ఆశలను కూటమి వమ్ము చేయదన్న నమ్మకం ఉంది.

- కుళ్లాయిస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్

టీడీపీతోనే ఎస్సీ, ఎస్టీలకు న్యాయం



ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన అంతమైంది.. భవిష్యత్తు తరాల సుభిక్షపాలన ప్రారంభమైంది. కార్పొరేషన్లకు పూర్వవైభవం వచ్చినట్లయింది. ఇంతకుముందు ఎలా కార్పొరేషన్లు జనాలతో కిటకిటలాడయో మళ్లీ ఇప్పుడు అదే పరుస జరుగుతుందన్న నమ్మకముంది. అదే నమ్మకంతోనే ఎస్సీ, ఎస్టీ ప్రజలందరూ కూటమిని గెలిపించుకున్నాం. చంద్రబాబునాయుడు ఏ కార్పొరేషన్లతో అయితే ఎస్సీ, ఎస్టీ వర్గాల జీవితాల్లో ఆనందం నింపారో మళ్లీ అవే కార్పొరేషన్ల ద్వారా వెలుగులు నింపుతారన్న నమ్మకం ఉంది. ఇక అందరికీ మంచి రోజులు వచ్చినట్లే.

- నెరిమెట్ల ఎల్లన్న, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు

అంటకాగినోళ్లలో మంట

జిల్లా అధికారుల్లో బదిలీల గుబులు

కలెక్టరును ఉంచుతారా? మార్చుతారా ?

జేసీ, డీఆర్ఓ, ఆర్డీఓలకు చలనం తప్పదా?

ప్లేస్‌ల కోసం టీడీపీ అనుకూల అధికారుల పైరవీలు

అనంతపురం టౌన్, జూన్ 10: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరనుండటంతో అధికారవర్గాలలో బదిలీలపై జోరుగా చర్చ సాగుతోంది. ప్రధానంగా జిల్లా అధికారులను ఉంచుతారా లేక బదిలీ చేస్తారా అనే చర్చ సాగుతోంది.

వైసీపీకి అంటకాగినోళ్లలో టెన్షన్

అధికారంలో ఉన్నపుడు వైసీపీకి అన్నీ తామేనంటూ అంటకాగి వ్యవహరించిన జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖల ఉన్నతాధికారులకు బదిలీ వేటు తప్పదన్న ప్రచారం జోరందుకుంది. ఇందులో భాగంగా డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డికు స్థాన చలనం తప్పదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఎన్నికలకు ముందు ఈఇద్దరు అధికారులు వైసీపీ అభ్యర్థుల విజయం కోసం కుట్రలు పన్నినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి, ఉరవకొండలో ఐకేపీ సిబ్బంది డబ్బులు పంపిణీ కోసం మీటింగ్ పెట్టుకొని అడ్డంగా టీడీపీ వారికి దొరికిపోయిన విషయం తెలిసిందే. ఆరోజే టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ నేరుగా పీడీపై ఆరోపణలు చేశారు. ఈక్రమంలోనే ఈఇద్దరు అధికారులకు బదిలీ తప్పదన్న ప్రచారం జరుగుతోంది. అలాగే జడ్పీ, విద్యాశాఖ, ఎస్ఎస్ఏ, వైద్య శాఖలలోను పలువురు బదిలీ కాక తప్పదన్న ప్రచారం జరుగుతోంది. దీంతో వీరందరు అపుడే మూట ముళ్లె సర్దుకొని వెళ్లిపోవడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. అలాగే అనుకూలమైన ప్రాంతాలలో పోస్టింగ్ ఇప్పించుకోవడానికి గుట్టుగా పైరవీలు సాగిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు తమ సొంత జిల్లా కర్నూలు, లేదా నంద్యాల జిల్లాకు వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆశాఖ వర్గాలు అంటున్నాయి. డీఎంహెచ్ఓకు సైతం బదిలీ తప్పదని అంటున్నారు. మరో వైపు టీడీపీకి అనుకూలంగా ఉన్నవారు జిల్లాలోని కీలక పోస్టులకు రావడానికి తమకు అనుకూలంగా ఉన్న నేతల వద్దకు క్యూకడుతున్నారు. ఇలా కొత్తగా టీడీపీ ప్రభుత్వం కొలువుదీరనుండటంతో అధిదికారులకు బదిలీల గుబులు పట్టుకుంది.



జేసీ, డీఆర్ఓ, ఆర్డీఓలకు బదిలీలు తప్పవా

జిల్లాలో అత్యంత కీలకమైన జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్, డీఆర్ఓ రామకృష్ణారెడ్డితోపాటు ముగ్గురు ఆర్డీఓలకు బదిలీలు తప్పవన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జేసీ రెండేళ్లకు పైగానే జిల్లాలో పని చేస్తున్నారు. పాలనలో వైసీపీ వారికి అనుకూలంగా పని చేశారనే ఆరోపణలున్నాయి. దీంతో జేసీకి బదిలీ తప్పక ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు ఇక్కడ ఉన్న డీఆర్ఓ గాయిత్రీదేవిని కోడ్ అమలులో భాగంగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో రామకృష్ణారెడ్డిని ఇక్కడికి డీఆర్ఓగా నియమించారు. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆర్డీఓలను కూడా ఎన్నికల సమయంలో వైసీపీ నేతలు ఇక్కడికి నియమించుకున్నారని, అందుకే ఎన్నికల సమయంలో వైసీపీకి పలు విషయాలలో అనుకూలంగా పనిచేసి స్వామిభక్తిని చాటుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో వీరందరికి కొత్త ప్రభుత్వంలో స్థాన చలనం తప్పదని చెప్పుకుంటున్నారు.



కలెక్టర్ సేఫేనా?

ప్రస్తుత జిల్లా కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్‌ను ఎన్నికల నిర్వహణ కోసం రెండు నెలల కిందట ఎన్నికల కమిషన్ నియమించింది. గత కలెక్టరు గౌతమిరెడ్డి వైసీపీకి ఎన్నికల పక్రియలో అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆధారాలతో టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, ఆమెను ఇక్కడనుంచి బదిలీ చేసి పంపించారు. ఆమె స్థానంలో కలెక్టర్‌గా వచ్చిన వినోద్‌కుమార్ జిల్లాలో ఎన్నికల పక్రియను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పకడ్బందీగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కలెక్టరు వినోద్‌కుమార్‌ను ఇక్కడ నుంచి బదిలీ చేస్తారా? లేక కొనసాగిస్తారా అనే చర్చ కొనసాగుతోంది.



తుంగభద్రకు పెరుగుతున్న వరద

బొమ్మనహాళ్, జూన్ 10: తుంగభద్ర జలాశయానికి వరద క్రమేపీ పెరుగుతోంది. రుతు పవనాల కారణంగా కర్ణాటకలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. జలాశయం ఎగువ ప్రాంతాలైన అగుంబె, వర్నాడు, ఖుదరేముఖ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా తుంగ, భద్ర నదులకు వరద పెరిగింది. తుంగభద్ర నదిలోనూ వరద ప్రవాహం రోజు రోజుకూ పెరుగుతోంది. జలాశయానికి సోమవారం 4,817 క్యూసెక్కుల వరద నీరు చేరుతోందని, 1580.23 అడుగుల వద్ద 4.58 టీఎంసీల నిల్వలు నమోదయ్యాయని బోర్డు అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో 280 క్యూసెక్కుల వరద నమోదైందని తెలిపారు.

బీటీపీలో పెరుగుతున్న నిల్వలు



గుమ్మఘట్ట, జూన్ 10: భైరవాన్‌తిప్ప రిజర్వాయర్‌లో నీటిమట్టం రోజు రోజుకు పెరుగుతోంది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1655 అడుగులు కాగా.. సోమవారం సాయంత్రానికి 1645.1 అడుగుల వరకు నీరు చేరింది. కర్ణాటకలోని చెళ్లకెర, హిరియూరు, శిర ప్రాంతాలలో వర్షాలు కురుస్తుండడంతో భైరవాన్‌వాన్ తిప్పకు త్వరలోనే భారీస్థాయిలో వరదనీరు చేరే అవకాశం ఉంది. ఈ ఏడాది రిజర్వాయర్‌కు రెండు టీఎంసీల పూర్తిస్థాయి నీరు ముందుగానే చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ప్రాణాలు తీసిన సరదా

చెక్‌డ్యాంలో పడి తండ్రికొడుకుల మృతి



రాజగోపాల్ మృతదేహం



వశిష్ట మృతదేహం

ఆత్మకూరు, జూన్ 10: మండల పరిధిలోని వడ్డుపల్లి గ్రామ సమీపంలోని చెక్‌డ్యాంలో పడి తండ్రి, కొడుకు మృత్యువాత పడ్డారు. అనంతపురం నగరంలోని 4వ రోడ్డుకు చెందిన రాజగోపాల్ తన కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం ఉదయం పంపనూరు ఆలయానికి వెళ్లారు. దర్శనానంతరం అనంతపురానికి బయలుదేరారు. మార్గం మధ్యలో, వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద చెక్ డ్యాంలో నీటిని చూసేందుకు తండ్రి, కొడుకు వెళ్లారు. ప్రమాదవశాత్తూ కుమారుడు వశిష్ట(7) నీటిలో పడిపోయాడు. కాపాడుకునేందుకు తండ్రి రాజగోపాల్(37) నీటిలో దుకాడు. ఈత రాకపోవడంతో ఇద్దరూ నీట మునిగారు. ఒడ్డున ఉన్న రాజగోపాల్ భార్య అరుణ కేకలు వేసి రోడ్డుపై వెళుతున్న వాహనదారులను పిలిచారు. వారు వెంటనే వచ్చి ఇద్దరినీ చెక్‌డ్యాం నుంచి బయటకు తీశారు. కొన ఊపిరితో ఉండగా 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతిచెందారని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కొత్త ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా సేవలు

సీఎం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేయండి

అధికారులకు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూన్ 10: కొత్త ప్రభుత్వం ఆకాంక్షల మేరకు ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో అన్ని ప్రభుత్వశాఖల ఉన్నతాధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలో పాలనా వ్యవహారాలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 12వతేదీ బుధవారం ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్నారని, ఈ వేడుకలను విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా బస్సులను, ఇతర వాహనాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో సీఎం ప్రమాణస్వీకార వేడుకలను వీక్షించడానికి లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో ప్రధాన కార్యాలయాల భవనాలకు లైటింగ్ ఏర్పాటు చేసి, ముస్తాబు చేయాలని ఆదేశించారు. ఇక నుంచి కొత్త ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్నిశాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

మొక్కలను నాటండి..

వర్షాకాలం కావడంతో జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్చెల్సీ ఉప కాలువల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి ప్రణాళికలు తయారీ చేయాలని సూచించారు. వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని, వైద్యశాఖ అప్రమత్తంగా ఉండి, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ శాఖలను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. మహిళా ఉద్యోగులను వేధించకుండా.. ప్రతి శాఖ కార్యాలయాలలో కమిటీలు ఏర్పాటు చేయాలని, ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక బాక్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పురపాలికల పరిధిలో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేయాలని, ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక కమిటీ వేయాలని సూచించారు.

17న కేంద్ర ఇంటర్ మినిస్టీరియల్ కమిటీ రాక

ఈ నెల 17వ తేదీన కేంద్ర ఇంటర్ మినిస్టీరియల్ కమిటీ జిల్లాకు వస్తుందని కలెక్టరు తెలిపారు. అధికారులు అన్నివిధాలా సిద్ధంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ, పశు సంవర్థక, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, గ్రౌండ్‌వాటర్, ఇరిగేషన్, డ్వామా శాఖలు గణాంకాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆ కమిటీ జిల్లాస్థాయిలో సమావేశం నిర్వహిస్తుందని, అనంతపురం, పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, విడపనకల్లు, కణేకల్లు మండలాలలో పర్యటిస్తుందని అన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులను సంప్రదిస్తారని, వారు అడిగిన సమాచారాన్ని తెలిపేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ నిదియ, నగరపాలిక కమిషనర్ మేఘస్వరూప్, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీపీఎం ఆనంద్, ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వసంతబాబు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన పరిటాల సునీత, శ్రీరామ్


చంద్రబాబుతో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం అర్బన్, జూన్ 10: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం విజయవాడలోని కరకట్ట వద్ద చంద్రబాబు నివాసంలో ఆయన్ను కలిసి.. సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబుకు వారు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలుపొందడంపై చంద్రబాబు వారిని అభినందించారు.

ఎమ్మెల్యే సవిత...


చంద్రబాబుకు డిక్లరేషన్ ఫారంను అందజేస్తున్న ఎమ్మెల్యే సవిత, భర్త వెంకటేశ్వరరావు

పెనుకొండ టౌన్, జూన్ 10: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే సవిత, భర్త వెంటేశ్వర రావుతో కలిసి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యాలయంలో చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిక్లరేషన్ ఫారంను ఆయనకు అందజేశారు.

బాలకృష్ణకు సింగవరం రవి జన్మదిన శుభాకాంక్షలు



బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సింగవరం రవి

అనంతపురం అర్బన్, జూన్ 10: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు టీడీపీ సీనియర్ నాయకులు ముళ్లపూడి రవీంద్రనాయుడు (సింగవరం రవి) జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హిందూపురంలోని ఆయన నివాసంలో బాలకృష్ణను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేగా వరుసగా మూడోసారి ఘన విజయం సాధించి హ్యాట్రిక్ సాధించడంపై శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని

పరిశీలించిన జాంబియా బృందం

పరిగిలో రైతులతో సమావేశం

హిందూపురం, జూన్ 10 : పరిగి మండలంలోని గొరవనహళ్లిలో స్థానిక రైతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని జాంబియా బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్, రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ ఇన్నోవేటివ్ అధికారి లక్ష్మానాయక్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇప్పటి వరకు 1.35లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని సాగుచేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4120గ్రామాల్లో ఈ కార్యక్రమం అమలు అవుతోందన్నారు. రైతు సాధికార సంస్థ ప్ర పంచ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు, దాతృత్వ సంస్థల భాగస్వామ్యంతో కలిసి పనిచేస్తోందన్నారు. ప్రపంచంలో విస్తృత స్థాయిలో ఆగ్రో ఎకాలజీ కార్యక్రమం నడుపుతున్న సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జాంబి యా దేశ ప్రతినిధి బృందం ఈ నెల 7నుంచి 21వరకు పర్యటిస్తోందని, ఇందులో ఉమ్మడి అనంత పురం జిల్లాలో ఈ బృందం పర్యటించిందన్నారు. ఇక్కడ సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయంపై సంతృప్తి చెందారని, తమ దేశంలోనూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కృషిచేస్తామని వారు చెప్పారని లక్ష్మానాయక్ తెలిపారు.


ఆహార దినుసులను పరిశీలిస్తున్న జాంబియా దేశ బృందం

రూ. 25 లక్షలు గంగపాలు

రెండేళ్లకే కొట్టుకుపోయిన రహదారి
వైసీపీ నాయకుల నిర్లక్ష్యపు పనులకు పరాకాష్ట
ఇబ్బంది పడుతున్న కణేకల్లు - మాల్యం గ్రామాల ప్రజలు

కణేకల్లు, జూన్ 10: వైసీపీ నాయకుల కాసుల కక్కుర్తికి రూ.25 లక్షల రోడ్డు కొట్టుకుపోయింది. కణేకల్లు - మాల్యం గ్రామాల మధ్య వేసిన మట్టి రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. వేదావతి హగరి ఉధృతంగా ప్రవహించే మట్టిరోడ్డు ఏ మాత్రం నిలబడదని తెలిసినా తమ జేబులను నింపుకోవడానికి వైసీపీ నాయకులు చేసిననాసిరకం పనులతో నేడు ప్రజాధనం వృథాగా కొట్టుకుపోయింది.రూ. 25 లక్షల నిధులతో కిలోమీటర్ మేర వేసిన మట్టిరోడ్డులో 70 శాతం వర్షాలకు కొట్టుకుపోగా 25 శాతం మాత్రమే మిగిలింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులకు మరలా కష్టాలు ప్రారంభమయ్యాయి.


కిలోమీటరు రహదారిలో మిగిలిన కొద్దిభాగం రహదారి

రూ. 25 లక్షలు మంజూరు

కణేకల్లు - మాల్యం గ్రామాల మధ్య వేదావతి హగరిలో అప్పట్లో టీబీ డ్యాం నుంచి విడుదలైన వరద నీరు ఉధృతంగా ప్రవహించేది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. అప్పటి ప్రభుత్వం ఇక్కడ మట్టిరోడ్డు ఏర్పాటుకు రూ.25 లక్షల పంచాయతీరాజ్ నిధులను మంజూరు చేసింది. ఆ రోడ్డు పనులపై స్థానిక వైసీపీ నాయకుల కన్ను పడింది. దీంతో అధికారులను మేనేజ్ చేసుకుని తూతూమంత్రంగా మట్టి వేసి పనులను ముగించారు.

15 రోజులకే రహదారికి గండి

నాణ్యత లేకుండా తూతూమంత్రంగా వేయడంతో నీటి ఉధృతికి 15 రోజులకే రోడ్డు తెగిపోయింది. దీంతో ఖంగుతిన్న అధికారులు, వైసీపీ నాయకులు మరలా పైపులు వేసి మరోసారి మట్టివేసి పనులను పూర్తి చేశారు. కానీ వారం కిందట వేదావతి హగరిలో ప్రవహించిన నీటి ఉధృతికి మరోసారి రోడ్డు మొత్తం మూడుచోట్ల తెగిపోయి ఏమాత్రం పనికి రాకుండా పోయింది.


కొట్టుకుపోయిన రహదారి.. ప్రవహిస్తున్న వేదవతి

ప్రయాణికుల అగచాట్లు

కణేకల్లు- మాల్యం గ్రామాల మధ్య ప్రయాణికులకు ప్రత్యామ్నాయ మార్గంగా ఉన్న హెచ్చెల్సీపై అధికారులు బస్సుల రాకపోలను పూర్తిగా నిలిపి వేశారు. మరోవైపు వేదావతి హగరిపై ఉన్న రహదారి కూడా తెగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో కణేకల్లుకు ఉరవకొండతో పాటు హనుమాపురం, సొల్లాపురం, మాల్యం, హనకనహాళ్, గరుడచేడు తదితర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉరవకొండ నుంచి వచ్చే ప్రయాణికులు మాల్యం వరకు ఆర్టీసీ బస్సుల్లోనూ అక్కడ నుంచి ఆటోల్లోనూ కణేకల్లుకు వస్తున్నారు. హెచ్చెల్సీపై గుంతలు మోకాలి లోతులో ఉండగా దానిపై ప్రయాణించేందుకు ప్రయాణికుల నానా అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా వేదావతి హగరిలోని కణేకల్లు- మాల్యం గ్రామాల మధ్య రహదారిని పూర్తి స్థాయిలో నాణ్యంగా, పటిష్టంగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో సోలార్ కాపర్ వైర్ దొంగలు

చాకచక్యంగా పట్టుకున్న సెక్యూరిటీ గార్డులు

నంబులపూలకుంట, జూన్ 10: మండలకేంద్రానికి సమీపంలోని సోలార్ అల్ట్రా పవర్ ప్రాజెక్టులో సోలార్ కాపర్ వైర్ చోరీకి పాల్పడిన దొంగలు పోలీసుల అదుపులో ఉన్నారు. సోమవారం సెక్యూరిటీ గార్డులు, సిబ్బంది ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పి.కొత్తపల్లి, ఎన్పీకుంట రెండు రెవెన్యూ గ్రామల్లో వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో మండలకేంద్రానికి సమీపంలో ఏడువేల ఎకరాల్లో సోలార్ అల్ట్రాపవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. 250 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ప్రాజెక్టును జాక్సన్ కంపెనీకి అప్పగించారు. గత నెల 27వ తేదీన జాక్సన్ కంపెనీలో కాపర్ వైరు చోరీ జరిగింది. 9 కిలోమీటర్ల మేర వైరును రాత్రి సమయంలో చోరీ చేయడంతో ఆసమయంలో ఉన్న సెక్యూరిటీగార్డులు ఇంజనీర్లకు సమాచారం చేరవేశారు. దొంగలు దొరక్కపోవడంతో అదే నెల 28న సురభి ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెక్యూరిటీ ఏజెన్సీ ఎఫ్ఓ సురేంద్రనాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఎలాగైనా దొంగలను పట్టుకోవాలని సెక్యూరిటీగార్డులు కాపలాకాసి రాత్రివేళ్లలో విధులు నిర్వహించారు. ఆదివారం రాత్రి కాపర్‌వైర్‌ను చోరీ చేసుకుని పోతున్నవారిని వెంబడించి పట్టుకున్నట్లు చెప్పారు. పోలీసులకు సమాచారం అందించి, వారిని అప్పగించారు. చోరీ చేసిన కాపర్ వైర్‌ను స్థానిక ఓ గుజరీ వ్యాపారికి చాలా ఏళ్ల నుంచి విక్రయిస్తున్నట్లు సమాచారం. దొంగలను, గుజరీ వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎస్ఐ శ్రీధర్‌ను వివరణకోరగా, విచారణ చేపట్టి, కేసు నమోదుచేస్తామని తెలిపారు.


చోరీ చేసిన కాపర్ వైర్

రాజకీయ కక్షతో మామిడి చెట్ల నరికివేత

మడకశిర రూరల్, జూన్ 10: మండలంలోని కేతేపల్లికి చెందిన హనుమంతరాయప్ప పొలంలోని మామిడి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నరికివేశారు. రాజకీయ కక్షతోనే ఈ పని చేశారని బాధిత రైతు తెలిపారు. కేతేపల్లికి చెందిన రామాంజనేయులు, హనుమంతరాయప్ప అన్నదమ్ములు. వీరిలో రామాంజనేయులు టీడీపీ బూత్ ఇన్‌చార్జ్, ఆయన తమ్ముడు హనుమంతరాయప్ప వైసీపీ నాయకుడు. హనుమంతరాయప్ప తనకున్న 1.30 ఎకరాల పొలంలో 90 మామిడి చెట్లు పెంచారు. ప్రస్తుతం అవి కాపునకు వచ్చాయి. అందులో పది చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నరికివేశారు. దీంతో రూ.2 లక్షల వరకు నష్టవాటిల్లిందని బాధిత రైతు పేర్కొన్నారు. కాగా పార్టీలు వేరైనా అన్నదమ్ములు ఒక్కటే అని, వారి మధ్య రాజకీయంగా చిచ్చు పెట్టడం కోసం కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రణాళిక ప్రకారం హనుమంతరాయప్ప పొలంలోని మామిడి చెట్లు నరికి వేసినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై హనుమంతరాయప్ప సోమవారం పోలీస్టేషన్‌కు వెళ్లారు. తన పొలంలోని మామిడి చెట్లను నరికివేసిన వారిని గుర్తించి, తగు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. దీనిపై మడకశిర సీఐ మనోహర్ మాట్లాడుతూ... కేతేపల్లికి చెందిన హనుమంత రాయప్ప పొలంలో మామిడి చెట్లను గుర్తితెలియని వ్యక్తులు నరికివేసి నట్లు ఫిర్యాదు అందిందన్నారు. గ్రామంలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోంటామని తెలిపారు.


హనుమంత రాయప్ప పొలంలో నరికి వేసిన మామిడి చెట్లు


అనంతపురం.. మేఘావృతం..


చీకటి పడేవేళ.. చినుకులు


అనంతపురం నగరంలో వర్షం

నైరుతి వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 10: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. అనంతపురం, పామిడి, డి.హీరేహాళ్, నార్పల, పెద్దవడుగూరు, గుంతకల్లు, పుట్లూరు, గుత్తి, యాడికి మండలాల్లో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. బెళుగుప్ప, యల్లనూరు, విడపనకల్లు తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 18 మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా శింగనమలలో 14.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉరవకొండ 12.2, గార్లదిన్నె 9.2 మి.మీ., మిగిలిన మండలాల్లో 9.0 మి.మీ. లోపు వర్షపాతం నమోదైంది.

నేడు, రేపు ఎంజేఆర్ కళాశాలలో మెగా జాబ్ మేళా

పీలేరు, జూన్ 10: అన్నమయ్య జిల్లా పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నేడు, రేపు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ ఎంపీ అవినాశ్ రెడ్డి తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా వారి సౌజన్యంతో రెండు రోజుల పాటు జరగనున్న జాబ్ మేళాలో 50కి పైగా కంపెనీలు పాల్గొంటాయని, సుమారు వేయి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసిన వారందరూ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని ఆయన వివరించారు. జాబ్ మేళాలో టెక్ మహీంద్రా, త్రెండ్జ్ ఇన్ఫర్మేషన్స్, జీఎస్ఎస్ గ్లోబల్, 24/7 ఏఐ, రోబోట్-ఈడీ, సాథర్లాండ్, టీం లీజ్, ఈఓఎస్ గ్లోబ్, క్యూస్స్ కార్ప్, అపోలో, ఫ్యూషన్ సి ఎక్స్ యంగ్ మైండ్స్, గ్రీన్ బ్లిస్, కాలిబర్ హెచ్ఆర్, ఎయిర్‌టెల్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తమ కళాశాలలో 30కిపైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలైన టీసీఎస్, ఆక్సెంచర్, డెల్టా ఎక్స్, ఆలోహ టెక్నాలజీస్, సూర్య టెక్ ప్రాంగణ ఎంపికలు చేసినట్లు తెలిపారు. తమ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికీ ఉద్యోగిగా అవకాశం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా ప్రతినిధి వెంకట మాట్లాడుతూ రెండు రోజుల జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.5.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. పీలేరు పరిసర ప్రాంత నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


ఎంజేఆర్ కళాశాల చైర్మన్ ఎంపీ అవినాశ్ రెడ్డి

చీనీకాయలు టన్ను రూ.38 వేలు

అనంతపురంరూరల్, జూన్ 10: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.38 వేలు, కనిష్ఠంగా రూ.15 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1204 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఇంట్లోకి చొరబడ్డ దొంగలు

మహిళపై దాడి.. 12 తులాల బంగారం దోపిడీ

తాడిపత్రి టౌన్, జూన్ 10: పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. ఓ ఇంట్లోకి చొరబడి మహిళను బెదిరించారు. బ్లేడ్‌తో దాడి చేసి 12 తులాల బంగారు ఆభరణాలను దోచుకున్నారు. తాడిపత్రి పట్టణంలోని రెడ్డినగర్‌లో దూదేకుల దస్తగిరి, ఆయన భార్య సరోజమ్మ నివాసం ఉంటుంది. బ్యాంకు పనిమీద దస్తగిరి బయటకు వెళ్లారు. ఆ సమయంలో వారి ఇంట్లోకి ఇద్దరు దుండగులు మాస్కులు, బురఖాలు ధరించి ప్రవేశించారు. సరోజమ్మ మెడలోని ఆరుతులాల బంగారు నగలు, చేతులకున్న బంగారు గాజులను ఇవ్వాలని భయభ్రాంతులకు గురిచేశారు. ఆమె మాట వినకపోవడంతో బ్లేడుతో విచక్షణారహితంగా దాడిచేశారు. బంగారు నగలను లాక్కొని ఉడాయించారు. విషయం తెలుసుకున్న దస్తగిరి వెంటనే ఇంటికి చేరుకుని, పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ జనార్దన్‌నాయుడు, సీఐ నాగేంద్రప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.


గాయపడ్డ సరోజమ్మ

గాయపడిన దుప్పి..

అటవీశాఖకు అప్పగింత

తనకల్లు, జూన్ 10: మండలంలోని పెద్దపల్లి గ్రామం వద్ద సోమవారం ఓ దుప్పి తీవ్రగాయాలతో గ్రామస్థుల కంటపడింది. గ్రామస్థులు దుప్పిని కాపాడి అటవీశాఖకు అప్పగించే ప్రయత్నం చేశారు. అటవీశాఖాధికారులు దుప్పివద్దకు చేరుకునేలోపు, దుప్పి మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన మేరకు దుప్పిని ఎవరైనా వెంటాడారో, లేక అడవిలో గాయపడిందో తెలియదన్నారు. అటవీశాఖాధికారి పెద్దపల్లి గ్రామం వద్దకు వెళ్లి పరిశీలించగా దుప్పి మృతిచెందింది. విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారులు దుప్పిని అక్కడనుంచి కొక్కంటి క్రాస్‌లో ఉన్న సెంట్రల్ నర్సరీకి తీసుకొచ్చారు. పశువైద్యాధికారి విజయ్‌ని పిలిపించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం దుప్పిని ఖననం చేశారు. అటవీశాఖాధికారి శ్రీరాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జూన్ 10: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని సోమవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మేలో ఎంసీఏ నాల్గొ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లమెంటరీతో పాటు (ఆర్17,20) సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. వీటితోపాటు మూడో సెమిస్టర్(ఆర్17,20,21) సప్లమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. అదేవిధంగా ఎంబీఏ తృతీయ సెమిస్టర్ (ఆర్17,21) సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఎప్పుడు కూలుతుందో...?

శిథిలావస్థలో పురం ఆసుపత్రి

హిందూపురం అర్బన్, జూన్ 10: రోగులకు సేవలు అందించడంలో ఉమ్మడి జిల్లాలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి రెండోస్థానంలో ఉంది. ప్రతి రోజూ వందలాది మంది రోగులు వివిధ చికిత్సల కోసం ఇక్కడికి వస్తుంటారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే విభాగం కీలకమైంది. దీని సమీపంలో ఉన్న ఆసుపత్రి భవనం పైభాగం శిథిలమైపోయింది. కూలడానికి సిద్ధంగా ఉంది. వర్షం వస్తే నీరు ఎక్స్‌రే విభాగానికి వచ్చే దారిలో బయటి వైపు నిల్వ ఉంటుంది. భవనం లీకేజీ నీరు పాత సీటీ స్కానింగ్ ప్రాంతంలో చేరుతుంది. దీంతో ఎక్స్‌రే కోసం వచ్చే రోగులు జారి పడే ప్రమాదం ఉంది. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అటుగా వెళ్లి పని చేయాలంటే పారిశుధ్య సిబ్బంది భయపడుతున్నారు. టీడీపీ హయాంలో ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. వైసీపీ అధికారంలోకి వచ్చాక హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్క అభివృద్ధి పని కూడా జరుగలేదు. ఏదైనా ప్రమాదం జరుగక ముందే సంబంధిత అధికారులు మేల్కొని, తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.


రంధ్రం ఏర్పడి లీకేజీ అవుతున్న పైనం

బాలకృష్ణకు గౌస్‌మొద్దీన్ జన్మదిన శుభాకాంక్షలు



అనంతపురం అర్బన్, జూన్ 10: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హిందూపురంలోని ఆయన నివాసంలో బాలకృష్ణను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యేగా వరుసగా మూడోసారి ఘన విజయం సాధించి హ్యాట్రిక్ సాధించడంపై శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో రాజకీయంగా మరింత ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

భువనేశ్వరి, లోకేష్‌ను కలిసిన పరిటాల సునీత, శ్రీరామ్





నారా చంద్రబాబు నాయుడి సతీమణి నారా భువనేశ్వరి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌ను మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం విజయవాడలోని కరకట్ట వద్ద చంద్రబాబు నివాసంలో వారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉద్యాన శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా ఫిరోజ్‌ఖాన్

అనంతపురం అర్బన్ : ఉద్యాన శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా ఫిరోజ్ ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసే ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు 40 రోజులపాటు సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్‌కు ఉద్యాన శాఖ జిల్లా అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్ : జిల్లాలోని ఆర్బీకేల్లో 14వ రోజైన సోమవారం విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి దాకా 73,456 మంది రైతులకు 67,673 క్వింటాళ్లు పంపిణీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 79,522 మంది రైతులు 70,199 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

అభివృద్ధికి ఆమడదూరం.. అక్కంపల్లి



అధ్వానంగా ఉన్న గ్రామ ప్రధాన రోడ్డు



సచివాలయం ఎదుట పారుతున్న మురుగునీరు

- అధ్వాన స్థితిలో రోడ్లు, కాలువలు
- వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే కారణం

అనంతపురంరూరల్ : వైసీపీ పాలకులు గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వాటిని అభివృద్ధి అటుంచి.. సమస్యలు సైతం ఏ మాత్రం పట్టించుకోలేదు. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి గ్రామమే ఇందుకు నిదర్శనం. ఈ గ్రామం నగరానికి కూతవేటు దూరంలో ఉన్నా.. అభివృద్ధి మాత్రం శూన్యం. గత టీడీపీలో జరిగిన అభివృద్ధే ఈ గ్రామంలో కనిపిస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులూ జరగలేదు. స్థానిక సమస్యల్లో ఏ ఒక్క దాన్నీ పరిష్కరించలేదు.

అధ్వానస్థితిలో గ్రామం..

ఈ గ్రామం ఏర్పాటై దశాబ్దాలు గడిచిపోయింది. చిన్న గ్రామం ఏర్పాటై పంచాయతీగా రూపాంతరం చెందింది. ఈ పంచాయతీ పరిధిలో అక్కంపల్లి గ్రామంతోపాటు ఎస్ఆర్ కాలనీ, ధర్మభిక్షం కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, సదాశివన్ కాలనీలు ఏర్పాటయ్యాయి. పంచాయతీ మొత్తంగా దాదాపు 1200 కుటుంబాలు ఉండగా.. ఐదు వేలకు పైగా జనభా ఉంటోంది. అక్కంపల్లి గ్రామంలో 250 కుటుంబాలు..పన్నెండు వందల జనభా ఉంటుంది. కాగా నేటికి గ్రామం మాత్రం అభివృద్ధికి దూరంగానే ఉంటోంది. గత ఐదేళ్లలో గ్రామ అభివృద్ధి మరింత అటక్కెదని గ్రామస్థులు వాపోతున్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు ఈ గ్రామాన్ని పూర్తిగా పట్టించుకోవడం మానేశారంటున్నారు.

కనీస మౌలిక వసతులు కరువే..

గ్రామంలో కనీస వసతులైన రోడ్డులు, కాలువల పరిస్థితి ఘోరంగా ఉంది. రోడ్లు ఏళ్లనాటివి కావడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. గుంతలు పడ్డాయి. గ్రామంలోని ప్రధాన రహదారి మరింత అధ్వానంగా ఉంది. కాలువల పరిస్థితి మరీ ఘోరం. గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లోనే మురుగు కాలువలు ఉండగా.. ప్రస్తుతం అవి కూడా శిథిలయ్యాయి. దీంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. మరి ముఖ్యంగా సచివాలయ ఎదుట పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు తిరుగుతున్నా.. ఆ సమస్యల గురించి ఏ నాడూ వారి పట్టించుకోలేదు.



అధ్వాన స్థితిలో ఉన్న కాలువ

15న హాకీ జట్టు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 10: స్థానిక ఆర్డీటీ స్టేడియంలో జిల్లా జట్టు ఎంపిక పోటీలను శనివారం నిర్వహిస్తున్నట్లు హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనీల్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, పదోతరగతి మార్కుల జాబితా, జనన ధ్రువీకరణ పత్రం, క్రీడా సామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 27 నుంచి ధర్మవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని, మరిన్ని వివరాలకు 94900 33474ను సంప్రదించాలని కోరారు.

16న ఆర్చరీ క్రీడాకారులకు...

స్థానిక ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో జిల్లా ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఆదివారం ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శివకుమార్ సోమవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 99492 79330ను సంప్రదించాలని కోరారు.

కేజీబీవీ టీచర్లు అందరినీ రెన్యువల్ చేయాలి

అనంతపురం విద్య, జూన్ 10 : సమగ్రశిక్ష కేజీబీవీ టీచింగ్ సిబ్బందిని అందరినీ రెన్యువల్ చేయాలని ఏపీ సమగ్రశిక్ష, కేజీబీవీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు విజయ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫర్ఫామెన్స్ ఇండికేషన్స్ ఆధారంగా ఉద్యోగులను రెన్యువల్ చేస్తామని కొత్త విధానాలను తీసుకొచ్చి ఉద్యోగులను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఏటా ఏప్రిల్ 30వ తేదీ ఒక రోజు గ్యాప్ ఇచ్చి మే 1వ తేదీ నుంచి ఉద్యోగులను రెన్యూవల్ చేసే వారన్నారు. పైగా అందరు ఉద్యోగులను రెన్యూవల్ చేసే వారన్నారు. అయితే ఫర్ఫామెన్స్ ఇండికేషన్స్ ఆధారంగా రెన్యూవల్ చేస్తామంటూ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. తక్షణమే కొత్తగా ఏర్పాటు కానున్న ప్రభుత్వం పెద్దలు చొరవ తీసుకుని, ఎలాంటి షరతులు లేకుండా కేజీబీవీ మహిళా ఉద్యోగులను అందరినీ వెంటనే రెన్యువల్ చేయాలన్నారు.

స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి

నార్పల, జూన్ 10: నార్పలలో స్పీడ్ బ్రేక్‌లను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి అశ్వర్థ నాయుడుకు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి లక్ష్మీనారాయణ సోమవారం వినతి పత్రం అందజేశారు. నార్పలలో స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని, చాలా మంది మరణించారని, మరికొం దరు తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. వెంటనే అధికారులు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరారు.



వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మీనారాయణ ➤

ఫైళ్లు ఎప్పటికప్పుడు క్లియర్ కావాలి

సమయపాలన, ఐడీ కార్డులు తప్పనిసరి : కలెక్టరు



కలెక్టరేట్‌లో పెండింగ్ ఫైల్స్‌పై సిబ్బంది వద్ద ఆరా తీస్తున్న కలెక్టరు వినోద్ కుమార్, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న ←

అనంతపురం టౌన్, జూన్ 10: ప్రతి ఫైల్‌ను వెంటనే పరిశీలించి క్లియర్ చేయాలని కలెక్టరు వినోద్ కుమార్ కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఏ,బీ,సీ,డీ,ఈ సెక్షన్‌లతో పాటు రికార్డు రూమ్స్, కేఆర్సీసీ రూమ్, భూసంస్కరణల కార్యాలయాన్ని కలెక్ట రు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి విభాగంలోకి వెళ్లి అక్కడ ఎంతమంది పనిచేస్తున్నారు.. ఎవరెవరు పనిచేస్తు న్నారు... అందులో ఎంతమంది డ్యూటీకి వచ్చారు.. పెం డింగ్ రికార్డులు ఎన్ని ఉన్నాయ్... తదితర వాటిపై ఆరా తీశారు. అనంతరం కలెక్టరు కలెక్టరేట్ అధికారులు, సిబ్బం దిని ఉద్దేశించి మాట్లాడుతూ... ఫైళ్ల నిర్వహణ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయకూడ దన్నారు. ఎప్పటికపుడు పరిశీ లించి వాటిని పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలని సూ చించారు. కలెక్టరేట్ ఉద్యోగులందరు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించి డ్యూటీకి హాజరు కావాల న్నారు. సమ యపాలన విధిగా పాటించాలని ఆదేశించారు. ఆర్టీఐ, ఎస్టీ ఎస్టీ కమిషన్ నుంచి వచ్చిన ఫైల్స్, కారుణ్య నియా మకాలకు సంబంధించిన ఫైల్స్ వెంటనే పరిష్కరిం చాలని సూచించారు. ఎన్‌హెచ్ 544కు సంబంధించి చాలా సమ స్యలు వస్తున్నాయని, వాటిని కరెక్ట్‌గా కరెక్షన్ చేయాలని అన్నారు. భూసంస్కరణల కార్యాలయాన్ని కలెక్టరేట్ సెక్షన్ లోకి మార్పు చేయాలని, కలెక్టరేట్‌కు ఐఎస్ ఓ సర్టిఫికెట్ కోసం దరకాస్తు చేయాలని ఏఓకు కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టరు బొల్లినేని వినూత్న, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ ఆనంద్, ఏఓ అంజన్‌బాబు పాల్గొన్నారు.

అధిక ధరలకు వస్తువులు అమ్మితే చర్యలు తీసుకోండి

ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు వస్తువులు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని లీగల్‌మెట్రాలజీ శాఖకు కలెక్టరు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి బస్టాండ్‌లతో పాటు పెన్నోబిలం తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాల వద్ద డెకాయ్ ఆపరేషన్‌లు చేయాలన్నారు. ముద్రించిన ధరలకన్నా ఎక్కువ ధరలకు వస్తువులు అమ్మకాలు చేస్తుంటే అలాంటి వారిపై అధికంగా పెనాల్టీలు వేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతినెలా యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని సంబంధిత రిపోర్టులను అందించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టరు బొల్లినేని వినూత్న, లీగల్‌మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ మహమ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

ఫీజుల పేరుతో దోపిడీని అరికట్టండి



మీడియాతో మాట్లాడుతున్న రమణ

అనంతపురం రూరల్, జూన్ 10: వివిధ రకాల ఫీజుల పేరుతో విద్యా సంస్థలు చేస్తున్న దోపిడీని అరికట్టాలని చేస్తున్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షుడు రమణ అన్నారు. సోమ వారం మండలంలోని ఆదర్శనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన ఆయన మీడియాతో మాట్లాడారు. మండలంలోని పాముూరాయి గ్రామ సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సీబీఎస్ పాఠశాలలో ఏడో తరగతి వరకు అనుమతులు తెచ్చుకుని పది వరకు క్లాస్‌లు నిర్వహిస్తున్నారన్నారు. పుస్తకాలపై విపరీతమైన ధరలు వేస్తున్నారన్నారు. ఫీజులు వాళ్లే నిర్ణయించి డిమాండ్ చేస్తున్నారన్నారు. టీచర్ల ఎంపికలో పారదర్శకత లేదని, సరైన సౌకర్యాలూ లేవని అన్నారు. పలు విద్యా సంస్థల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఏనాడూ పాఠశాలకు వెళ్లి తనిఖీలు చేసిన పరిస్థితులు లేవన్నారు. పాఠశాలలోని సమస్యలపై కలెక్టరేట్‌లో అర్జీలు ఇచ్చినా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైన పాఠశాలను తనిఖీ చేయాలని, వాటిల్లో వసతులు కల్పించాలని, అధిక ఫీజులు వసూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ



సమావేశంలో పాల్గొన్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 10: రాష్ట్రంలో విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ.... రాష్ట్రంలో విద్యారంగంలో అనేక సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొత్తగా కొలువుదీరనున్న ప్రభుత్వం ఆ దిశగా అడుగేయాలని కోరారు. ముఖ్యంగా జీవో 117 వెంటనే రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీని విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా 1998, 2008 డీఎస్సీ టీచర్లను రెగ్యులర్ చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో విద్యారంగానికి, ఉపాధ్యాయులకు తీరని నష్టం జరిగిందన్నారు. కొత్త ప్రభుత్వంలో టీచర్ల సమస్యలను పరిష్కరించాలని, కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రమణయ్య, సహాయ అధ్యక్షులు రామప్ప, సరళ, కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శి ప్రమీల, ఇతర నేతలు అర్జున్, సంజీవ్‌కుమార్, జిల్లా ఆడిట్ కన్వీనర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వీల్‌చైర్ వితరణ

అనంతపురం కల్చరల్, జూన్ 10: సాయి ట్రస్టు ఆధ్వర్యంలో నగరానికి చెందిన నూతేటి రజనీకాంత్ సహకారంతో బెరాక వృద్ధాశ్రమానికి వీల్‌చైర్ వితరణ చేశారు. సోమవారం సాయం త్రం గొట్కూరులోని బెరాక వృద్ధాశ్ర మానికి చేరుకుని వీల్‌చైర్, వృద్ధులకు చేతికర్రలను అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్, వెంకటలక్ష్మి, ట్రస్టు సభ్యులు నారాయణనాయక్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పలువురిపై కేసు

అనంతపురం క్రైం, జూన్ 10 : నగరంలోని నాయక్‌నగర్‌లోని 37వ సచి వాలయంలోని శిలాఫలకాన్ని సోమవారం ధ్వంసం చేశారు. ఈ ఘటనపై సచివాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు నాయక్‌నగర్‌కు చెందిన సాకే రవితేజ, సాకే జయప్ప, శ్రీకాంత్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ క్రాంతి కుమార్ తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా బంద్

అనంతపురంరూరల్, జూన్ 10: విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళ వారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అనంతపురం టౌన్-1 డీఈఈ నాగేంద్ర తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఓబుళదేవరనగర్, విద్యుత్ నగర్, అరవిందనగర్, హౌసింగ్‌బోర్డు, లక్ష్మీనారాయణ కాలనీ, రాజీవ్ చిల్డ్రన్ పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

నీట్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలి: ఏఐఎస్‌ఏ



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్‌ఏ నాయకులు

అనంతపురం సెంట్రల్, జూన్ 10: వైద్య విద్య కళాశాలల ప్రవేశాల కోసం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటి ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్-2024)ను తిరిగి నిర్వహించాలని ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన లో ఆయన మాట్లాడారు. తమ పిల్లలను డాక్టర్‌ను చేయాలన్న తపనతో లక్షలాదిమంది తల్లిదండ్రులు కూలీపనులు చేసి చదివిస్తున్నారన్నారు. ఎంట్రెన్స్ కోచింగ్ అంటూ రూ.లక్షలు పోసి చదివిస్తే.. కేంద్ర ప్రభుత్వం అవకతవలకు పాల్పడుతూ విద్యార్థులు.. వారి తల్లిదండ్రుల ఆశలపై నీళ్ల చల్లిందని మండిపడ్డారు. అక్రమంగా జేబులు నింపుకునేందుకు నీట్ పరీక్షా పేపర్లను లీక్‌చేసి ప్రతిభగల విద్యార్థులను రోడ్డున పడేసిందని వాపోయారు. తక్షణమే నీట్ పరీక్షలను తిరిగి నిర్వహించి.. బాధిత విద్యార్థులకు న్యాయం చేయకపోతే కేంద్ర ప్రభుత్వ అవినీతిని రోడ్డు కీడుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, రాజునాయక్, సద్దాం, ఉదయ్ పాల్గొన్నారు.

ఫలితాలపై విచారణ చేయించాలి : ఏఐఎస్‌ఎఫ్

అనంతపురం విద్య : నీట్ ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విడుదల చేసిన నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మందికి 720 మార్కులకు 720 మార్కు లు రావడం అనేక అనుమానాలకు తావిస్తోం దన్నారు. అంతేకా కుండా అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానా లోని ఒకే సెంటర్ వారు కావడం సందేహాలకు దారితీస్తోం దన్నారు. వెంటనే ఎన్టీఏ విడుదల చేసిన ఫలితాలపై కేంద్రం స్పందించి విచారణ చేయించాలని కోరారు. దేశవ్యాప్తంగా ప్రతిభ ఉన్న వేలాది మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఫలితాలు చూస్తుంటే... పేపర్ లీకేజీపై అనేక అనుమానాలు కలుగుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేయించాలని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పేద మెడికల్ విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నేతలు వంశీ, మంజునాథ్, ఉమామహేష్, హరికృష్ణ, రారాజు, పవన్, హర్ష, సమీర్, శేఖర్, వరుణ్, తరుణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు

రాజీనామాల పర్వం

గోరంట్ల, జూన్ 10: స్థానిక ఏడీసీసీ బ్యాంకు పరిధిలోని ఏడు సహకార సంఘాల చైర్మెన్ తమ పదవులకు సోమవారం రాజీనామా చేశారు. మండలంలోని గోరంట్ల సహకార సంఘం చైర్‌పర్సన్ శివశంకర్‌రెడ్డి, వానవోలు రాజేంద్రప్రసాద్, బూదిలి రఘురావిరెడ్డి, గౌనివారిపల్లి బయపరెడ్డి, పాలసముద్రం పాటూరి శంకర్‌రెడ్డి, చిలమత్తూరు మండలంలోని సోమగట్ట అమరప్ప, కోడూరు సహకార సంఘం చైర్‌పర్సన్ హనుమంతురెడ్డి రాజీనామా చేసినవారిలో ఉన్నారు.

వీరితోపాటు ఒక్కో సహకార సంఘంలోని ఇద్దరు పర్సన్లుగా వ్యవహరిస్తున్నవారు రాజీనామా చేశారు. హిందూపురం డివిజనల్ సహకార సంఘం అధికారికి రాజీనామాలను అందజేశారు.

కదిరి వైసీపీలో క్యాంపు రాజకీయం

బెంగళూరుకు కౌన్సిలర్ల తరలింపు



కదిరి మునిసిపల్ కార్యాలయం

కదిరి, జూన్ 10: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభంజనం సృష్టించడం, కదిరిలో కందికుంట వెంకటప్రసాద్ గెలుపొందడంతో వైసీపీలో గుబులు పట్టుకుంది. మున్సిపల్ చైర్మన్ సీటుకు గండం ఏర్పడే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. దీంతో క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. కదిరి మున్సిపాలిటీలోని పలువురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీకి టచ్‌లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉన్న కొంతమంది కౌన్సిలర్లను హుటాహుటిన బెంగళూరుకు తరలించినట్లు సమాచారం. ఓడిపోయిన వైసీపీ అభ్యర్థి మగ్బుల్ వద్దకు కౌన్సిలర్లను తీసుకెళ్లినట్లు సమాచారం. తామంతా ఐక్యంగా ఉన్నామని చెప్పించడానికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం తరువాత ఎలాంటి పరిణామాలు ఉంటాయోనని బెంగళూరుకు వెళ్లినట్లు సమాచారం. మునిసిపల్ చైర్మన్ చాంబర్‌కు ఇప్పటికే కమిషనర్ తాళాలు వేశారు. చైర్‌పర్సన్ వచ్చినపుడు మాత్రమే తాళాలు తీస్తామని చెబుతున్నారు. మున్సిపల్ కమిషనర్ వద్ద తాళాలుంటాయని చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎలాంటి పరిణామాలుంటాయోనని పట్టణంలో చర్చ సాగుతోంది.




గుత్తిలో కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


గుంతకల్లులో వృద్ధులకు బ్రెడ్లు అందజేస్తున్న మస్తాన్ యాదవ్


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం(గుంతకల్లు టౌన్)


ఉరవకొండలో కేకును కట్‌చేస్తున్న నందమూరి అభిమానులు


లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న అభిమానులు

ఘనంగా బాలకృష్ణ జన్మదినం

గుత్తి, జూన్ 10: స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణస్వామి, యంగన్నపల్లి సర్పంచు భరత్, బోర్‌వెల్ నాగరాజు, కృష్ణయ్య, న్యాయవాది సోమశేఖర్, ఎంకే చౌదరి, రవి, ఎంపీటీసీ నారాయణస్వామి, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్, పులికొండ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు: టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్ ఆధ్వర్యంలో బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని అనురాగ వృద్ధాశ్రమంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణ స్వామి, మోహన్, యాదవ్, వీరేశ్, సూరి, కిష్టప్ప, శంకరప్ప పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ యూనిట్ అధ్యక్షుడు లింగన్న, ఉపాధ్యక్షులు రుక్కు, ఆర్పీ వెంకటేష్, మనోహర్, నారాయణ, మస్తాన్, శ్రీనివాసులు, జయరాం, రంగా, న్యాయవాది హేమాద్రి, కోడెల చంద్రశేఖర్, బండారురామన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలో గవిమఠం గవిసిద్ధేశ్వరాలయంలో ఎన్‌బీకే ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సినీనటుడు బాలకృష్ణ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవి మఠం ఆవరణంలో కేకును కట్ చేశారు. వన్నూర్ స్వామి, కృష్ణ, నిమ్మలప్రసాద్, నరసయ్య, లాల్‌స్వామి, శివ, పురుషోత్తం, విశ్వనాథ్‌గౌడ్, దాదా, వేణుగౌడ్, రఘు, నారాయణ, శివరుద్ర, నాగభూషణం, రఘు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న బాలకృష్ణ అభిమానులు

యాడికి: సినీహీరో నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు సోమవారం పలు వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేశారు. యాడికిలోని లక్ష్మీప్రియ థియేటర్ వద్ద కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రాయలచెరువులోని లీలావతి వృద్ధాశ్రమం, యాడికిలోని ఆగాపే వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నగరి రంగడు, బాలకృష్ణ, కడ్డీల నాగేంద్ర, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను పట్టణంలో నందమూరి అభిమాన సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, సతీష్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినాయకసర్కిల్ నందు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మేస్త్రీ సిద్ధప్ప, సతీష్, గుడ్లయ్య, పరమేశ్వరప్ప, బాలకృష్ణ, సత్తి పాల్గొన్నారు.

అంజన్న సేవలో న్యాయాధికారి


ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న న్యాయాధికారి

డి. హీరేహాళ్, జూన్ 10: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నేమకల్లు ఆంజనేయస్వామిని రాయదుర్గం సివిల్ కోర్టు న్యాయాధికారి రమ్య సోమవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. న్యాయాధికారిని ఆలయ ప్రధాన అర్చకులు శాలువతో సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం


ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న కురుబ సామాజిక వర్గం నాయకులు

బెళుగుప్ప, జూన్ 10: ఉద్యోగ విరమణ పొందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బులిగొండ్ల ఈశ్వరప్పను ఘనంగా సన్మానించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం సన్మానసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ మల్లారెడ్డి పాల్గొన్నారు. తోటి ఉపాధ్యాయులు, కురుబ సామాజిక వర్గం వారు గజమాలతో సన్మానించారు. స్వాన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాస విద్యానికేతన్ కరెస్పాండెంట్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పయ్యావుల మధు, మాజీ జడ్పీటీసీ నారాయణ స్వామి, వన్నూరుస్వామి, పెద్దతిప్పయ్య, తగ్గుపర్తి రాధాకృష్ణ, మల్లికార్జున, త్రివేదినాయుడు, ప్రతాప్‌రెడ్డి, కంచిరాముడు, నాగరాజు, ఈశ్వర తదితరులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సొంత నిధులతో అపరిశుభ్రత తొలగింపు


కాలువలను శుభ్రం చేస్తున్న యంత్రం

కళ్యాణదుర్గం, జూన్ 10: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కళ్యాణదుర్గం మున్సిపాల్టీ అంతా అపరిశుభ్రంగా మారిపోయి అస్తవ్యస్తంగా పట్టణమంతా మురికి కూపంగా దర్శనమిచ్చింది. ఈనేపథ్యంలో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న దృఢ నిశ్చయంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేరుపోయిన అపరిశుభ్రతను సోమవారం యంత్రాలతో తొలగింపజేశారు. పట్టణంలో ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, ముళ్లకంపలను, మురుగునీటిని హిటాచితో శుభ్రం చేయించారు. మున్సిపాల్టీ సిబ్బంది దగ్గరుండి ప్రధాన కాలువలను శుభ్రం చేయించారు.

ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

కుందుర్పి, జూన్ 10: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవం ప్రత్యక్ష ప్రసారాన్ని మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాలను మండల కేంద్రంలోని ఆర్‌బీకే కేంద్రం లో ముఖ్యమంత్రి, మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు.

మండలంలో 8.7 మిల్లీమీటర్ల వర్షపాతం

బెళుగుప్ప, జూన్ 10: మండలంలో ఆదివారం రాత్రి 8.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. ప్రతి రోజు వర్షం కురుస్తుండటంతో తేమ శాతం ఎక్కువగా ఉన్నందున సేద్యపు పనులు ప్రారంభించలేదని రైతులు పేర్కొన్నారు.

బీజేపీ సంబరాలు


గుత్తిలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

గుత్తి, జూన్ 10: ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగుర వేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, నాయకులు రామాంజనేయులు, రంగరాజు, నారాయణ, మనోజ్‌కుమార్, వలిబాష, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం కొలువుదీరనుండటంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పాతబస్టాండ్‌లో పోలేలరమ్మ దేవాలయం వద్ద సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలమి రామాంజినేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి హాజరై కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, నాయకులు పురంధర్, రంగన్న, శ్రీదేవి, వాసం రవిబాబు, కేశవ, కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు కోడెల చంద్రశేఖర్, కౌన్సిలర్ సుధాకర్, న్యాయవాది హేమాద్రి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెడతా

● ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, జూన్10: నూతన ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే నియోజకవర్గంలో నెలకొని ఉన్న పారిశుధ్య సమస్య, తాగునీటి సమస్య, రోడ్లు, వైద్య సదుపాయాల విషయంగా దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన గెలుపు కోసం కృషిచేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఏ సమస్య వచ్చినా ఓ కుటుంబ సభ్యుడిలా సాయపడతానన్నారు. పార్టీ శ్రేణులు కూడా గొడవలకు పోయి పోలీసు స్టేషన్ మెట్లను ఎక్కరాదని, గ్రామాభివృద్ధిని కాంక్షిస్తూ మండలాభివృద్ధి కార్యాలయం మెట్లు ఎక్కాలని సూచించారు. కేంద్రంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మంచి పలుకుబడిని సాధించారని, కేంద్ర సహకారంతో రాష్ట్రాభివృద్ధిని సాధిస్తారని పేర్కొన్నారు. బీజేపీ నాయకుడు పసుపుల హరిహరనాథ్, జనసేన నాయకుడు వాసగిరి మణికంఠ మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలకు సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, కేసీ హరి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, గుజరీ మహ్మద్ ఖాజా, పత్తి హిమబిందు, తలారి మస్తానప్ప, కోడెల చంద్రశేఖర్, అహ్మద్ బాషా, అంజి, టీ గోపి, బీజేపీ నాయకులు బండారు కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

గుమ్మనూరుకు ఘన సన్మానం

పామిడి: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను తెలుగుతమ్ముళ్లు సోమవారం ఘనంగా సత్కరించారు. తక్కువ వ్యవధిలోనే కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించడంపై నగర కులస్థులు, పలు గ్రామాల నాయకులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

దోమ కాటుతోనే డెంగీ

రాయదుర్గం రూరల్, జూన్ 10: దోమకాటు వల్ల డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని రాయదుర్గం యూనిట్ మలేరియా నివారణాధికారి నాగేంద్రప్రసాద్ గ్రామస్థులకు వివరించారు. మండలంలోని ఆర్‌బీవంక, చిక్కనదొడ్డి గ్రామాలలో సోమవారం డెంగీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేకమైన చికిత్స అంటూ ఏదిలేదని, లక్షణాలు కనిపిస్తే సాధ్యమైనంత త్వరగా చికిత్స తీసుకోవాలి. జ్వరం ఎక్కువగా రావడం, తీవ్రమైన తలనొప్పి, కంటి నొప్పి, వాంతులు అవుతున్నట్లు అనిపించడం, డీ హైడ్రేషన్‌కు గురికావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గర్లోని హాస్పిటల్‌లో చూపించుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీళ్లు ఎక్కువగా నిలిచి ఉన్నా దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామాంజినేయులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.


నీటి తొట్టెను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

గుత్తి ఆర్‌ఎస్‌లో చోరీ

గుత్తి, జూన్ 10: పట్టణంలోని సుందరయ్య కాలనీలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు శివశంకర్ ఇంట్లో ఆదివారం చోరీ జరిగినట్లు బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం తన కూతురు సీమంతం కార్యక్రమాన్ని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న రూ. 10వేలు, జత బంగారు కమ్మలు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ లీకేజీ

గుత్తి,జూన్10: పట్టణంలోని గణేష్ నగర్‌లోని ప్రమీళమ్మ ఇంట్లో గ్యాస్ లీక్ కావడం, ఆమె అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం ఇంట్లో టీ చేసేందుకు గ్యాస్ స్టౌ వెలిగించగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ప్రమీళమ్మ వెంటనే తడి బట్టలను సిలిండర్‌పై వేసింది. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. ప్రమాదం తప్పడంతో ఇంట్లో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

కంపచెట్ల తొలగింపు

పామిడి, జూన్ 10: మండలంలోని ఎదురూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు విజయభాస్కర్‌నాయుడు తన సొంత నిధులతో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను సోమవారం తొలగించారు. పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామం నుంచి పామిడి మండలం ఎదురూరు గ్రామం వరకూ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి రోడ్డుపైకి వచ్చాయి. దీంతో రోడ్డు కుంచించుకుపోయి వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. వర్షాకాలం కావడంతో కంపచెట్లు మరింత పెరిగి సమస్యాత్మకంగా మారడంతో ఎక్స్‌కవేటర్‌తో కంపచెట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టారు.

ఆలయ భూములను సర్వే చేయించండి


వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

యాడికి, జూన్10: మండలకేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ భూములను సర్వే చేయించాలని ఆలయ ఈఓ దుర్గాప్రసాద్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సర్వేనెంబర్లు 1120, 1275, 313, 372, 426లకు సంబంధించిన భూములను సర్వే చేయించవలసినదిగా కోరినట్లు తెలిపారు. సదరు సర్వేనెంబర్లను సర్వే చేయించి సరిహద్దులు నిర్ణయిస్తే వాటి పరిరక్షణ దిశగా చర్యలు చేపడతామని తెలిపారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన

పుట్లూరు, జూన్10: ఖరీఫ్‌లో సాగుచేసే పలు పంటలపై ఆత్మ పీడీ మద్దిలేటి, రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ శైలజ రైతులకు అవగాహన కల్పించారు. మండలకేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వర్షాలు సరైన సమయంలో వస్తుండటంతో వర్షపునీరు భూమిలోకి ఇంకిపోయేలా రైతులు పొలాలను దుక్కి చేసుకోవాలన్నారు. వేరుశనగ, కంది, ఆముదం సాగులో అధిక దిగుబడులను ఇచ్చే మేలైన రకాల విత్తనాలను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ కాత్యాయిని, సిబ్బంది పాల్గొన్నారు.

అడంగల్ కోసం రైతుల అగచాట్లు


సచివాలయంలో అడంగల్ కోసం వేచి ఉన్న రైతులు

గుమ్మఘట్ట, జూన్ 10: మండలంలో రైతులు బ్యాంకుల్లో పంట రుణాల రెన్యువల్‌కు అవసరమైన 1బీ, అడంగల్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటిని జారీ చేయాల్సిన సచివాలయ సిబ్బంది సక్రమంగా ఇవ్వకపోవడంతో నానా అగచాట్లు పడుతున్నారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సకాలంలో సక్రమంగా విధులకు రాకపోగా, 1బీ, అడంగల్ సర్టిఫికెట్లు అందించడానికి సర్వర్లు, ప్రింటర్లు పనిచేయడం లేదని చెబుతున్నారు. దీంతో రైతులు బ్యాంకుల్లో రుణాలను రెన్యువల్ చేయడానికి ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. సోమవారం గుమ్మఘట్ట మండల కేంద్రంలోని సచివాలయం వద్ద 1బీ, అడంగల్ కోసం వందలాది మంది రైతులు వేచి ఉన్నారు. మండల కేంద్రంలోని సచివాలయంలో మాత్రమే సర్వర్ పని చేస్తుండటంతో 1బీ, అడంగల్ సర్టిఫికెట్లను తీసుకునేందుకు వివిధ గ్రామాల రైతులు సచివాలయం వద్ద బారులు తీరారు. ప్రతి గ్రామంలో సచివాలయం ఉన్నప్పటికీ సిబ్బంది పనిచేయకపోవడం దారుణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాలుష్యం నుంచి పంట పొలాలను కాపాడండి

సీపీఐ రైతు సంఘం నాయకులు

డీ.హీరేహాళ్, జూన్ 10: కాలుష్య కోరల నుంచి పంట పొలాలను కాపాడాలని సీపీఐ రైతు సంఘం నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. ప్రతినిత్యం ఐరన్‌ఓర్ పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యంతో ఆ పరిశ్రమల చుట్టు పక్కల సుమారు రెండు కిలోమీటర్ల మేర పంటలు పంటపొలాలు పూర్తిగా నాశనమవుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున, రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, కొట్రేష్ తదితరులు రైతులతో కలిసి కాలుష్యానికి గురైన పంటపొలాలను పరిశీలించారు. అనంతరం అక్కడ నుండి రైతులతో కలిసి మూకుమ్మడిగా మండల ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎస్ఎల్‌వీ, జేఆర్ మెటల్ స్పాంజ్ ఐరన్ పరిశ్రమల వద్దకు వెళ్లి గతంలో మాదిరిగా రైతులను ఇబ్బంది పెట్టకుండా పంట నష్టపోయిన ప్రతి రైతుకు భారీ మొత్తంలో పరిహారం అందించాలని యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. రైతులను ఆదుకోకపోతే రాబోవు రోజులలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


పొలాలను పరిశీలిస్తున్న సీపీఐ రైతు సంఘం నాయకులు

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు


దేవాలయంలో టెంకాయలు కొడుతున్న టీడీపీ శ్రేణులు

కూడేరు, జూన్ 10: రాష్ట్రంలో కూటమి గెలుపుతోపాటు ఉరవకొండ నియోజకవర్గంలో పయ్యావుల కేశవ్ గెలుపొందడంతో టీడీపీ నాయకులు మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం జోడులింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో పార్టీ నాయకుడు పి. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చింతబరి 101 టెంకాయలను కొట్టారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు


టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ,జూన్10: ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ గెలుపొందడంతో టీడీపీ నాయకులు 101టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని పెద్ద ముష్టూరు గ్రామంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గ్రామంలో పూజలు బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెట్టెం రామకృష్ణ, నెట్టెంసుభాష్, కృష్ణమూర్తి, నాగరాజు, వెంకటేశులు పాల్గొన్నారు.

11మంది బైండోవర్

తాడిపత్రిటౌన్, జూన్10: మండలంలోని బ్రాహ్మణపల్లి, ఆలూరు గ్రామాలకు చెందిన 11మంది వైసీపీ మద్దతుదారులను సోమవారం బైండోవర్ చేశామని రూరల్ పోలీసులు తెలిపారు. బ్రాహ్మణపల్లికి చెందిన శివారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, హరికృష్ణ, వెంకటేశ్వర రెడ్డి, అశోక్‌తోపాటు మరో నలుగురిని తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా బైండోవర్ చేసినట్లు తెలిపారు. అనంతరం పూచీకత్తుపై విడిచిపెట్టారు.

ఈఓపీఆర్డీగా దాస్

బొమ్మనహాళ్, జూన్ 10: మండలం ఈఓఆర్డీగా దాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న విజయమ్మ గత నెల ఉద్యోగ విరమణ పొందడంతో అప్పటి నుండి ఖాళీగా ఉన్న ఈఓపీఆర్డీ పోస్టును దాస్‌తో భర్తీ చేశారు.

విద్యుత్ కోతలతో ఉద్యోగుల పాట్లు

బొమ్మనహాళ్, జూన్ 10: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఉపాధి ఉద్యోగులు మొబైల్‌కు ఉన్న టార్చ్‌లైట్ వేసుకొని విధులు నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అధికారులు నిర్లక్ష్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాల సీజ్

యాడికి, జూన్10: రైతులకు నాణ్యమైన ఎరువులు, మందులను విక్రయించాలని, నకిలీ విత్తనాలను విక్రయిస్తే ఫర్టిలైజర్స్ దుకాణాలను సీజ్‌చేస్తామని వ్యవసాయశాఖ గుత్తి ఏడీఏ వెంకటరాముడు, యాడికి ఏఓ మహబూబ్‌బాషా తెలిపారు. సోమవారం యాడికిలోని శ్రీ వెంకట్ ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎరువులు, మందులు, విత్తనాల నిల్వలను తనిఖీచేశారు.

ఆర్టీసీ బస్ కండక్టర్‌పై బాలిక ఫిర్యాదు

తాడిపత్రిటౌన్, జూన్10: ఆర్టీసీ బస్సులో కండక్టర్ అసభ్యంగా ప్రవర్తించాడని పుట్లూరు మండలం శనగలగూడూరుకు చెందిన బాలిక సోమవారం డయల్ 100ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన మేరకు నంద్యాలజిల్లా ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో బాలిక తాడిపత్రికి రావడానికి ఉయ్యాలవాడలో ఎక్కింది. కొంతదూరం ప్రయాణించిన తర్వాత కండక్టర్ రఫీ అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. దీంతో విసుగు చెందిన బాలిక మండలంలోని బుగ్గకు వచ్చిన తర్వాత డయల్ 100కు ఫోన్ చేసింది. స్పందించిన పోలీసులు కొత్తబ్రిడ్జీ వద్దకు బస్సు చేరుకోగానే కండక్టర్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

ఏటీఎం దొంగతనంపై ఎస్పీ ఆరా


దొంగతనం జరిగిన ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమిశాలి

కూడేరు, జూన్ 10: మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఏటీఎంలో చోరీ జరగడం పట్ల ఎస్పీ గౌతమిశాలి సీరియస్‌గా పరిగణించారు. చోరీ జరిగిన ప్రదేశాన్ని సోమవారం రాత్రి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తనిఖీ చేసి దొంగలు వచ్చిన సమయంలో రికార్డు అయిన సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. దొంగలను ఎలా పట్టుకోవాలో సిబ్బందికి సూచించారు. అంతకు ముందు స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ శివరాముడుతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రాళ్లదాడి కేసులో ఏడుగురి అరెస్ట్

తాడిపత్రి టౌన్, జూన్ 10: ఎన్నికల నేపథ్యంలో జరిగిన రాళ్లదాడి కేసులో సోమవారం ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. పట్టణ సమీపంలోని కొత్తబ్రిడ్జి వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో వైసీపీకి చెందిన కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి, కోడూరు నాగేశ్వర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సూర్యతేజారెడ్డి, నరసింహారెడ్డి, కాశీమనోజ్, చాకలి సాయి ఉన్నారు.